క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శాకంబరి ఉత్సవాలు



జగ్గయ్యపేట: పట్టణంలోని బ్రాహ్మణ బజారులో వేంచేసి యున్న అన్నపూర్ణా సహిత కాశీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పలురకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు):మండలంలోని గుమ్మడిదుర్రులో శనివారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గ్రామంలో కాలువలు శుభ్రం చేయడంతోపాటు బ్లీచింగ్ చల్లించారు. అలాగే దోమల మందును గ్రామంలో స్ప్రే చేయించారు. ఆయా పనులను సర్పంచ్ నక్కా కమల, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షించారు.

ఏవో రాఘవశర్మ బాధ్యత స్వీకారం



నందిగామ టౌన్: మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పీవీ రాఘవశర్మ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏవోగా బాధ్యతలు నిర్వహించిన కరిముల్లా ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో రాఘవశర్మ బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని జిల్లా యూత్ వెల్ఫేర్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న రాఘవశర్మ బదిలీపై ఇక్కడి వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

ఆలయాల అధికారులతో సమీక్ష

నందిగామ టౌన్: దేవాదాయ శాఖాధికారులు ఆలయాలకు చెందిన ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని డిప్యూటీ కమిషనర్ విజయరాజు సూచించారు. పట్టణంలోని సీతారామాంజనేయ స్వామివారి ఆలయ ఆవరణలో నందిగామ డివిజన్‌లోని దేవాదాయ శాఖాధికారులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ఆయా ఆలయాల ఈవోలు రికార్డుల్లో ఆయా వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. ఆక్రమణకు గురైన భూములు తిరిగి ఆలయాలకు దక్కేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆలయానికి సంబంధించిన, భూముల కౌలు వేలం పాటలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, ఆయా ఆలయాల ఈవోలు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పాత కక్ష్యల నేపథ్యంలో చిల్లకల్లు ఎస్సీకాలనీలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ శనివారం తెలిపారు. మాతంగి సునీత ఫిర్యాదు మేరకు యండ్రాతి నాగరాజు, ఎల్.కుమారి, యండ్రాతి ప్రసాద్, మరియమ్మలపై, మందా దానమ్మ ఫిర్యాదు మేరకు ప్రభాకర్, నాగబాబు, మురళి, చిట్టిబాబు, బుద్ధయ్య, యోహాన్, నరసమ్మ, శృతిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. అదే విధంగా హెడ్ కానిస్టేబుల్ దాసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

తిరుమలగిరి(జగ్గయ్యపేట):గుర్తుతెలియని వ్యక్తులు మహిళా కూలీ మెడలోని బంగారు గొలుసును లాక్కు వెళ్లిన ఘటన తిరుమలగిరి గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ..మండలంలోని అనుమంచిపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు మహిళా కూలీలు వ్యవసాయ పనుల నిమిత్తం ఆటోలో గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో దిచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చి సుంకర సుభద్ర అనే మహిళ మెడలోని బంగారపు గొలుసుతో లాక్కుని జాతీయ రహదారి గుండా చిల్లకల్లు వైపు పరారయ్యారు. గొలుసు విలువ రూ. 1.50 లక్షల వరకు ఉంటుందని బాధితురాలు సుభద్ర, చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

ఆక్రమణల చెరలో ▸ కీసర-గండేపల్లి రోడ్డు

- రోడ్డు ఆక్రమించి ఇళ్లు, షాపుల నిర్మాణం
- కుంచించుకుపోయిన రోడ్డు
- వాహనాల రాకపోకలకు తీవ్ర అవరోధం
- ఇబ్బందుల్లో వాహనచోదకులు, ప్రజలు



ఆక్రమణల కారణంగా కీసర-గండేపల్లి రోడ్డులో ట్రాఫిక్ పరిస్థితి ఇది

కంచికచర్ల: ప్రయాణికులు, వాహనదారులతో నిత్యం రద్దీగా ఉండే కీసర-గండేపల్లి రోడ్డు ఆక్రమణలకు గురైంది. దీంతో వాహనచోదకులు నిత్యం అవస్థలుపడుతున్నారు. మండలంలోని కీసర 65వ నంబర్ జాతీయ రహదారి నుంచి గండేపల్లి వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డును కొంతమంది వ్యక్తులు ఆక్రమించారు. అక్రమంగా దుకాణాలు, ఇళ్లు నిర్మాణం చేపట్టారు. దీంతో రోడ్డంతా కుంచించుపోయింది. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడంతో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది.

పలు గ్రామాలకు కీలక రోడ్డు ఇదే..

కీసర హైవే నుంచి ప్రారంభమయ్యే ఈరోడ్డు కంచికచర్ల మండలంలోని గండేపల్లి గ్రామాన్ని కలుపుకుంటూ వీరులపాడు మండలం జమ్మవరం, బోడవాడ, నందలూరు, తాటిగుమ్మి, జుజ్జూరు తదితర గ్రామాలకు వెళ్లే ప్రధానరోడ్డు. అంతేకాకుండా ఇదే రోడ్డుపై నందిగామ, జగ్గయ్యపేట నుంచి తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం వరకు వాహనదారులు, ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా గండేపల్లిలో సెంటినీ కర్మాగారం ఉంది. ఈ కర్మాగారంలో పనిచేసే వందలాది మంది కార్మికులు నిత్యం బస్సులు, ఆటోల్లో వెళ్తుంటారు. దీంతో ఈ రోడ్డులో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది.

దర్జాగా ఆక్రమణలు...

కీసర, గండేపల్లి గ్రామాల్లో రోడ్డు మార్జిన్ స్థలాలను కొంతమంది దర్జాగా ఆక్రమించుకుని షాపుల నిర్మాణం చేపట్టారు. కొంతమంది అక్రమంగా షాపులు కట్టి అద్దెకు ఇచ్చి నెలవారీగా వసూలు చేసుకుంటున్నారు. మరికొందరు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నుంచి బయట పడాలంటే కనీసం అరగంటకుపైగా సమయం పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన అక్రమంచి నిర్మించిన షాపులకు వచ్చే కొనుగోలుదారులు వారి వాహనాలను రోడ్డుపైనే నిలుపుదల చేస్తున్నారు. ఈ రోడ్డుపై ఎదురుగా వాహనాలు రావాలంటే చిన్నగా ఆగుకుంటూ ముందుకు సాగాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్డంతా ఆక్రమణకు గురవటంతో పది అడుగులు మాత్రమే మిగిలింది. అంతేకాకుండా దుకాణా ఎదుట వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డు మరింత ఇరుకుగా మారి వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. గండేపల్లి సెంటినీ కర్మాగారానికి చిన్నస్థాయి వాహనాల నుంచి భారీ స్థాయి కంటైనర్లు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి సమయాల్లో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి ఆక్రమణల తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ మార్గంలో నిత్యం ప్రయాణం సాగిస్తున్న ప్రజలు కోరుతున్నారు.

ఇరువైపులా ఆక్రమణలు..



గతంలో 40 అడుగుల మేర రోడ్డు ఉండేది. కీసర, గండేపల్లి రెండు గ్రామాల్లో రోడ్డు పక్కన నివసించే వారంతా ఆక్రమించుకుని పెద్ద పెద్ద దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డంతా కుంచించుకుపోయింది. ఆక్రమణలు తొలగించాలి.

– బి.నాగేశ్వరరావు, ఎలక్ట్రికల్ వర్క్స్, కీసర

రోడ్డంతా గోతులమయం..



ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నాకు కారు ఉంది. రెండు మూడు రోజులకు ఒకసారి రోగులను వైద్యం కోసం విజయవాడ, గుంటూరు ఆసుపత్రులకు తీసుకెళ్లతుంటా. కాని గోతుల కారణంగా భయపడుతున్నాం. రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించడంతోపాటు గోతులను పూడ్చాలి.

– తలమాల కిషోర్, గండేపల్లి

ఆక్రమణలు తొలగించాలి..



గండేపల్లి-కీసర రోడ్డులో కొంతమంది వ్యక్తులు అక్రమంగా రోడ్డు స్థలాలను ఆక్రమించుకున్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా కట్టడాలు నిర్మించారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌లోని ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.

– బొక్కా రవికుమార్, సర్పంచి, గండేపల్లి

ప్రతిభచూపిన 'గురుకులం' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జగ్గయ్యపేట అర్బన్: ఏటిఎల్(అటల్ టింకరింగ్ ల్యాబ్) మారథాన్ 2023–24 జాతీయ టీమ్ ఐడియాస్ పోటీలకు జగ్గయ్యపేటలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న ఏపీ బాలయోగి బాలికల గురుకులం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. జాతీయస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్రం నుంచి 35జట్ల ఐడియాలు ఎంపికకాగా, ఎన్టీఆర్ జిల్లా నుంచి ఏడు జట్ల ఐడియాలు ఎంపికయ్యాయి. ఈ ఏడింటిలో జగ్గయ్యపేట గురుకుల పాఠశాలకు చెందిన ఐదు జట్ల ఐడియాలు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ తెలియజేసినట్లు జగ్గయ్యపేట గురుకులం ప్రిన్సిపాల్ కొండపల్లి లక్ష్మీసుజాత శనివారం తెలిపారు. ప్రతిభచూపిన విద్యార్థులతోపాటు ఏటీఎల్ ల్యాబ్ ఇన్‌చార్జ్ కె.శ్రీదేవిని పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ తిరుమలరెడ్డి శౌరీలమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులను ప్రోత్సహించిన ప్రిన్సిపాల్ లక్ష్మీసుజాతను జిల్లా విద్యాశాఖాధికారి యూవీ.సుబ్బారావు ప్రత్యేకంగా అభినందించారు.

మహిళాభివృద్ధితోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న సిస్టర్ లైజీ జోష్

జగ్గయ్యపేట అర్బన్: మహిళాభివృద్ధి కోసం కీర్తి పరస్పర సహాయ సహకార పొదుపు, పరపతి సంఘం కృషి చేస్తోందని సోషల్ వర్క్ ఇన్‌చార్జ్ సిస్టర్ లైజీ జోష్ తెలిపారు. సంఘ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని అమెరికన్ హాస్పిటల్ ఆవరణలోని సొసైటీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు.ఈసందర్భంగా లైజీ జోష్ మాట్లాడుతూ సమాజం అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. మహిళాభివృద్ధికి సొసైటీ చేస్తున్న కృషిని వివరించారు. బోర్డు నూతన సభ్యులను ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతున్న బాలుడికి ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలుడు సుధీర్ పాల్ కుటుంబానికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు మండలం గుడివాక లంక(కొల్లేరు)కు చెందిన మోరు రమేష్, సుమతి దంపతుల కుమారుడు సుధీర్ పాల్ గుడివాక లంకలో 7వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో తోటి విద్యార్థులు బాధితుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించగా 60 శాతం ఒళ్లు కాలిపోగా చికిత్స పొందుతున్నాడు. పేదలైన సుధీర్ పాల్ తల్లిదండ్రులు సాయం కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించగా విజయవాడ సిటీ పోలీస్ తరుపున రూ.10వేలు నగదును హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, రామకృష్ణ, మహిళా కానిస్టేబుల్ దివ్య హాస్పిటల్‌కు వెళ్లి అందజేశారు. బాధితుడి తల్లిదండ్రులు మాట్లాడుతూ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రబడుతున్న పత్తిచేలు



మక్కపేటలో పత్తిచేలో నిలిచిన వర్షపు నీరు



పెనుగంచిప్రోలు వద్ద ఎర్రబడిన పత్తి మొక్కలు, పెరిగిన కలుపు ఉధృతి

- వర్షపు నీరు నిల్వ ఉండటంతో పెరిగిన కలుపు
- కుళ్లిపోతున్న పత్తి మొక్కలు

పెనుగంచిప్రోలు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాల్లోని పత్తిచేలల్లో నీరు తగ్గక పంట కాస్తా ఎర్రబడుతోంది. దీంతో పత్తిసాగు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో రైతులు ఈఏడాది 20 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లో ముఖ్యంగా పల్లంగా ఉండి నీరు ఎటూ వెళ్లే పరిస్థితిలేని వందల ఎకరాల పత్తిపొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో పత్తి మొక్కలు ఎర్రబడి కుళ్లిపోతున్నాయి. ఏపంటకైనా అధికశాతం తేమ తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. పత్తిచేలల్లో రోజుల తరబడి నీరు నిలిచి ఉండటంతో అధికశాతం తేమ కారణంగా పత్తి మొక్కలు ఎర్రబడటంతోపాటు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏపుగా పెరుగుతున్న కలుపు..

వర్షాలకు పొలాలకు కలుపు విపరీతంగా పెరుగుతోంది. కలుపు తీసేందుకు పొలంలోకి రైతులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పంటను కాపాడుకునేందుకు మందులు, ఎరువులకు కూడా ఖర్చు అధికమవుతోందని రైతులు చెబుతున్నారు.

పెరుగుదల లేదు...



వర్షాలకు పత్తిమొక్కల్లో పెరుగుదల లేదు. వర్షాలకు పొలాలు అన్నీ కలుపుతో బీడులుగా మారాయి. కలుపు తీయాలంటే కూలీలకు ఒక్కొక్కరికి రోజుకు రూ.300 ఇవ్వాల్సిందే. ఏదైనా మందులు కొట్టాలన్నా పొలాలు బురదగా ఉండటంతోపాటు, రోజూ వర్షం పడుతుండటంతో కొట్టలేకపోతున్నాం.

– రాములు, రైతు, పెనుగంచిప్రోలు

మొక్కలు ఎర్రబడుతున్నాయి..



రెండు ఎకరాల్లో పత్తి సాగు చేపట్టాను. ఎడతెరపి లేకుండా పడిన వర్షాలకు పత్తి మొక్కలు ఎర్రపడ్డాయి. పంటను కాపాడుకోవటానికి సాగు మొదట్లోనే మందులు కొట్టేందుకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. పత్తి ధర కూడా ఆశించినస్థాయిలో లేదు.

– మీసాల లాజర్, రైతు, సుబ్బాయిగూడెం

అంతర సేద్యం చేయాలి..



సాధ్యమైనంతవరకు పత్తిచేనులో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. భూమిలో తేమను ఆరగానే అంతర సేద్యం చేయాలి. వర్షం తగ్గిన వెంటనే ఎకరానికి 20కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులు వేస్తే మంచిది.

– భవాని, ఏడీఏ, జగ్గయ్యపేట

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు

నందిగామ జడ్జి రేష్మా

నందిగామ టౌన్: లైంగిక వేధింపులకు సంబంధించి చట్టంలో కఠిన శిక్షలున్నాయని అడిషినల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ రేష్మా పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 'మంచి స్పర్శ– చెడు స్పర్శ'పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మేజిస్ట్రేట్ రేష్మా మాట్లాడుతూ దురుద్దేశంతో ఆడపిల్లలను తాకే వారిని న్యాయస్థానాలు కఠినంగా శిక్షిస్తాయన్నారు. ముఖ్యంగా లైంగిక వేధింపులకు పాల్పడితే ఫోక్సో చట్టం ద్వారా కేసు నమోదు చేస్తారన్నారు. 12ఏళ్ల లోపు బాలికలపై అత్యాచారానికి పాల్పడితే ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా మరణ శిక్ష విధిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు హనుమంతరావు, కురగంటి కృష్ణంరాజు, గుర్రాల వెంకటరత్నం, కొమ్మినేని మాలేశ్వరరావు, షేక్ ఆజాద్, వేల్పుల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం : ఎమ్మెల్యే సౌమ్య



పరిటాలలో ప్రార్థనా మందిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సౌమ్య, స్థానికులు

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాలలో నిర్మించిన హెర్మోన్ ప్రార్థనా మందిరాన్ని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శనివారం ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీస్తు మాటలు నమ్మి జీవించే వారికి ఏ కొదువ ఉండదన్నారు. క్రీస్తు బోధనలు ఆచరణీయమని, ఆయన బోధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. సమాజంలో అన్ని మతాలను గౌరవించాలన్నారు. అనంతరం 5వేల మందికి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కోగంటి బాబు, నందిగామ బార్ అసోసియేసన్ అధ్యక్షుడు నంద్రు బాబూ విద్యాసాగర్, న్యాయవాది చెరుకుమల్లి రామారావు, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

కొడాలి అపర్ణకు నాయకుల నివాళి



కొడాలి అపర్ణకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: బీజేపీ నాయకురాలు, కేంద్ర సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు కొడాలి అపర్ణ అంత్యక్రియలను శనివారం జగ్గయ్యపేటలో నిర్వహించారు. అపర్ణ భౌతికకాయాన్ని బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి మధుకర, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, గుత్తికొండ రాజబాబు, విజయవాడ పార్లమెంట్ సంయోజక్ ముప్పాల సుబ్బయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెఎస్.ఆర్ముగం, ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీఅధ్యక్షుడు రామినేని వెంకటకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా మాజీ అధ్యక్షుడు బబ్బూరి శ్రీరాం, రాష్ట్ర మాజీఅధికారప్రతినిధి కేవీ.లక్ష్మీపతిరాజా, సీనియర్ నాయకులు కిలారు దిలీప్, పీయూష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు భోగపల్లి శ్రీధర్, కోలపల్లి గణేష్, జగ్గయ్యపేట అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొల్లి నాగేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు యర్రా సునీత, స్థానిక నాయకులు కీసర రాంబాబు, మన్నె శ్రీనివాసరావు, అన్నెపాగ శ్రీకాంత్, బొడ్డు మల్లికార్జునరావు, కల్లూరి శ్రీవాణి, కాకాని వెంకటేశ్వరరావు, గోలి రాఘవ, మేడూరి వెంకటేశ్వరరావు, వేదా సుబ్రహ్మణ్యం, శ్రీకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. పార్టీ అభివృద్ధికి ఆమె చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అపర్ణ కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ముర్రుపాలు అమృతంతో సమానం



పెనుగంచిప్రోలులో ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది



నవాబుపేటలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు

పెనుగంచిప్రోలు: బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమని, పుట్టిన వెంటనే బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. తల్లులు తమ బిడ్డలకు తప్పనిసరిగా ముర్రుపాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. అలాగే నవాబుపేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బోడవాడ, జమ్మవరం గ్రామాల్లో..

వీరులపాడు: తల్లిపాలలో బిడ్డకు కావాల్సిన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి పేర్కొన్నారు. మండలంలోని బోడవాడ, జమ్మవరం గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాల విశిష్టతను గర్భిణులు, బాలింతలకు తప్పక గుర్తించాలని వైద్యారోగ్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం సంధ్య, అంగనవాడీ కార్యకర్తలు సుజాత, మహాలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

90 బస్తాల అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం



అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ రేషన్ బియ్యం తనిఖీ చేస్తున్న ఆర్ఐ గోపీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి షాదీఖానాలో అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ రేషన్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులకు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ పాపారావు, ఆర్ఐ గోపి శనివారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ తాళం వేసి ఉన్న ఎండీయూ వాహనం తనిఖీ చేయగా లెక్కలో లేని 46 బస్తాలు బియ్యం ఉన్నట్లు గుర్తించారు. షాదీఖానా లోపల మరో 44 బస్తాలు నిల్వ ఉంచారు. మొత్తం 90 బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. వాహన నిర్వాహకుడే అక్రమంగా బియ్యం నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఎండీయూ వాహన నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరులో శనివారం పాము కాటుకు ఓ వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో స్వీట్‌షాపు నిర్వహిస్తున్న రాజపురోహిత్ కిషోర్ (58) శుక్రవారం రాత్రి ఇంటి వద్ద నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు మంత్ర పెట్టించి నయం అవుతుందనుకున్నారు. శనివారం ఉదయం రాజపురోహిత్ కిషోర్ సొమ్మసిల్లి పడిపోగా వెంటనే మధిర ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. రాజస్థాన్ నుంచి వచ్చి 32 ఏళ్లుగా కిషోర్ గ్రామంలో మిఠాయి దుకాణం నిర్వహిస్తున్నాడు. మృతునికి భార్య, నలుగురు సంతానం.

■ ఆరుగురు జూదరుల అరెస్టు

గుళ్లపూడి(గంపలగూడెం): గంపలగూడెం మండలం గుళ్లపూడిలోని ఓ ఇంట్లో పేకాడుతున్న వారిపై పోలీసులు దాడిచేశారు. ఎస్‌ఐ ఎస్. శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి శనివారం దాడి చేశారు. పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.26 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.